
అందరూ క్షేమంగా ఉన్నారు: కలెక్టర్



పార్వతీపురం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కురుపాం గురుకులానికి చెందిన విద్యార్థినులందరూ క్షేమంగానే ఉన్నారని, ఆందోళన అవసరం లేదని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ కేజీహెచ్, పార్వతీపురం జిల్లా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నానని వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మాత్రమే విద్యార్థినులను కేజీహెచ్‌కు తరలించామన్నారు. ప్రతి రెండు గంటలకొకసారి వారి ఆరోగ్య స్థితి తెలుసకుని సూచనలు అందజేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థినులు ఎలా ఉన్నారు?

- కురుపాం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆరా
- తీసుకున్న చర్యలను వివరించిన మంత్రి సంధ్యారాణి
- కేజీహెచ్‌లో 42, జిల్లా కేంద్రాసుపత్రిలో 88 మందికి వైద్య సేవలు



పార్వతీపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఈ మేరకు ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫోన్ చేశారు. విద్యార్థినులు ఎలా ఉన్నారని అడిగారు. అధికారులు తీసుకున్న చర్యలపై నివేదికలు అందించాలని సూచించారు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో 42 మంది, పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రిలో 88 మంది విద్యార్థినులు వైద్యసేవలు పొందుతున్నట్లు మంత్రి సంధ్యారాణి సీఎంకు వివరించారు. వారి ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించామని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా కురుపాం విద్యార్థినుల అస్వస్థతపై కలెక్టర్, వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇద్దరు బాలికల మృతిపై విచారం వ్యక్తం చేశారు. త్వరలో కురుపాంలో పర్యటించనున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ చెప్పారు.

12 వరకు గురుకులానికి సెలవులు

పార్వతీపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు ఈ నెల 12 వరకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు గురుకులంలో యుద్ధ ప్రాతిపదికన ఆర్‌వో ప్లాంట్ పనులు, క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర వైద్య బృందం నివేదికలు అందించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఇక జిల్లాలోని అన్ని వసతి గృహాలు, గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా గురుకులంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా రక్త పరీక్షలు నిర్వహించ నున్నారు. ఫలితాలను బట్టి అవసరమైన వారికి వైద్య సేవలు అందించనున్నారు.



కేజీహెచ్‌లో పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

పరామర్శించిన మంత్రి

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/బెలగాం,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి నుంచి ఆదివారం మరో 14 మంది కురుపాం విద్యార్థినులను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం ముగ్గురు, శనివారం 25 మందితో కలుపుకుని మొత్తంగా అక్కడ 42 మంది చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం పార్వతీపురంలో 88 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా సీఎం ఆదేశాలతో మంత్రి సంధ్యారాణి ఆదివారం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, కంటికి రెప్పలా చూసుకోవాలని అక్కడి వైద్యసిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా మంత్రి సంధ్యారాణి సోమవారం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి రానున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, తదితర విషయాలపై కలెక్టర్, వైద్యాధికారులతో సమీక్షించనున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

బెలగాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : జాండీస్ లక్షణాలతో బాధపడుతున్న కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి గౌతమి ఆదేశించారు. ఆదివారం జిల్లాకేంద్రాసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆమె తెలిపారు. సుమారు 600 మంది విద్యార్థినులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ముందస్తుగా వైద్యసేవలు అందించినట్లు వెల్లడించారు. కొన్ని రోజులుగా 120 మంది జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. పచ్చకామెర్లు అధిక మోతాదులో ఉన్న వారికి విశాఖ కేజీ హెచ్‌కు తరలి స్తున్నామని, ఎవరు ఎటువంటి ఆందోళన చెందొద్దని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని నిరంతర పర్యవేక్షిస్తున్నా మన్నారు. ఈ ఘటనపై ప్రత్యేక బృందాన్ని నియమించామని, వారు సమగ్ర విచారణ జరిపి నివేదికలు అందించిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగశివజ్యోతి ఉన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి గౌతమి

వానొస్తే వణుకే!

- ఎగువ ప్రాంతం ఒడిశాలో కురిసినా తప్పని ముంపు బెడద
- తుపాన్ల సమయంలో గ్రామాల్లోకి వరద
- ఇబ్బందుల్లో తోటపల్లి నిర్వాసితులు
- శిథిలావస్థ ఇళ్లలో బిక్కుబిక్కుమంటూ జీవనం
- అనేక సమస్యలతో బాసంగి, సుంకి వాసులు సతమతం
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు



ముంపులో బాసంగి గ్రామం(ఫైల్)

జియ్యమ్మవలస, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో బాసంగి, కళ్లికోట నిర్వాసిత గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షం కురిస్తే చాలు ఆ ప్రాంతవాసులు ముంపు సమస్యను ఎదుర్కోవల్సి వస్తోంది. ఎగువ ప్రాంతం ఒడిశా రాష్ట్రంలో వానలు పడినా వారికి ఇక్కట్లు తప్పడం లేదు. నాగావళి నది వరద ఈ గ్రామాల్లోకి పోటెత్తడంతో బిక్కుబిక్కు మంటూ శిథిలావస్థ ఇళ్లలోనే ఉండాల్సిన దుస్థితి. కొన్నేళ్లుగా వారు ఇలా ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే కొండంత ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..


- జియ్యమ్మవలస మండలం నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న బాసంగిని 2004-05 లో తోటపల్లి నిర్వాసిత పంచాయతీగా ప్రకటించారు. ఈ గ్రామంలో 384 కుటుంబాలు ఉండగా.. వీరికి ప్యాకేజీ, భూములకు విలువ కట్టి నిధులు ఇచ్చేశారు. కానీ పునరావాసం కల్పించడం మాత్రం మరిచి పోయారు. వారికోసం బట్లభద్ర రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్లు 63, 65, 67/2, 69/22, 71, 72లలో 30.58 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, రక్షిత నీటి పథకం ట్యాంకు, విద్యుత్ స్తంభాలు వేశారు. గ్రామంలో 384 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు కూడా సిద్ధం చేశారు. 252 మంది ఇళ్ల పట్టాలు తీసుకొని కేటాయించిన స్థలంలోకి వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నారు. కానీ ఇళ్లు మాత్రం మంజూరు చేయలేదు. దీంతో వారికి కేటాయించిన స్థలం ఇప్పుడు పిచ్చి మొక్కలతో నిండి అధ్వానంగా మారింది. ఇళ్లు మంజూరు చేస్తే తాము ఆ ప్రాంతానికి వెళ్లిపోతామని బాసంగి వాసులు చెబుతున్నారు. కాగా బాసంగిలో శిథిలావస్థ ఇళ్లలో ఉంటున్న వారికి ఏటా తుపాన్ల సమయంలో ముంపు సమస్యను ఎదుర్కోవల్సి వస్తోంది. బాసంగి ముంపు సమస్యపై తహసీల్దార్ వై.జయలక్ష్మిని వివరణ కోరగా.. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని తెలిపారు. ఇక గరుగుబిల్లి మండలం సుంకి పంచాయతీ పరిస్థితి దాదాపు ఇదేవిధంగా ఉంది. ఈ పంచాయతీలో మొత్తం 365 కుటుంబాలు నివస్తున్నాయి. వీరికి మరుపెంట పంచాయతీ



సుంకి గ్రామంలో నిర్వాసితుల ఇంటి పరిస్థితి ఇదీ..

(మిగతా 6వ పేజీలో...)

ఘనంగా కోటదుర్గమ్మ తిరువీధి



పాలకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోట దుర్గమ్మ తిరువీధి మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈవో వీవీ సూర్యనారాయణ, ప్రధాన అర్చకుడు డి. లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూర్య ప్రభ పల్లకిలో కోటదుర్గమ్మ తీరువీధి నిర్వహించారు. భారీగా పాల్గొన్న భక్తజనం అమ్మవారి ఉత్సవ విగ్రహం మోయడానికి పోటీపడ్డారు. ఉత్సవంలో బళ్ల వేషాలను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. మరోవైపు సాము గరిడీలు, నవరడ్యాన్స్‌లు, కోలాటాలు, పులివేషాలు ఇతర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ప్రయోగ మూర్తి, వందలాది మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొత్తూరు వాసి గణపతి అమ్మవారి లడ్డూను రూ.38వేలకు దక్కించుకున్నారు.



కోటదుర్గమ్మ తిరువీధిలో పాల్గొన్న భక్తజనం

ఏనుగు పిల్ల మృతి

- చెరువులో ఒకేసారి దిగిన గజరాజులు
- వాటి మధ్య తొక్కిసలాట
- ఆ కారణంగానే చనిపోయినట్లు అధికారుల వెల్లడి



మృతి చెందిన గున్న ఏనుగు

పార్వతీపురం రూరల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓ ఏనుగు పిల్ల మృతి చెందింది. పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురం గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆ ప్రాంతంలో కొద్దిరోజులుగా తొమ్మిది గజరాజులు సంచరిస్తున్నాయి. అయితే ఆదివారం సాయంత్రం సేదతీరేందుకు అవన్నీ ఒకేసారి ఆ గ్రామానికి సమీపంలో ఉన్న ముదరై చెరువులో దిగాయి. ఇదే సమయంలో వాటి మధ్య జరిగిన తొక్కిసలాటలో ఓ గున్న ఏనుగు మృతి చెందింది. ట్రాకర్ల ద్వారా ఈ విషయం తెలుసుకున్న రేంజర్ మణికంఠ తమ సిబ్బందితో అక్కడుకు చేరుకుని పిల్ల ఏనుగును చెరువులో నుంచి బయటకు తీయించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహిస్తామని చెప్పారు. కాగా గున్న ఏనుగు మృతి చెందడంతో మిగిలిన ఎనిమిది గజరాజులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఘీంకరించాయి. దీంతో లక్ష్మీనారాయణపురం ప్రజలు బెంబేలెత్తిపోయారు. వాటివల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఒంటరిగా గ్రామస్థులు బయటకు రాకూడదని మరోవైపు అటవీశాఖాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

వేగవంతంగా తరలించడం మేలు

జిల్లాలో పార్వతీపురం డివిజన్‌లో ప్రస్తుతం ఎనిమిది ఏనుగులు, పాలకొండ డివిజన్‌లో మరో నాలుగు గజరాజులు సంచరిస్తున్నాయి. కొన్నేళ్లుగా వాటివల్ల ఆస్తి, పంట, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. మరోవైపు వివిధ కారణాలతో ఏనుగులు కూడా మృత్యువాత పడుతున్నాయి. గతంలో భామిని మండలంలో నాలుగు గజరాజులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. కొమరాడ మండ లంలో ఒకటి, నాగావళి నది ఊబిలో పడి మరో ఏనుగు మృత్యు వాతపడ్డాయి. తాజాగా గున్న ఏనుగు చనిపోయిన నేపథ్యంలో తక్షణమే జిల్లాలో సంచరిస్తున్న గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఖాజీపురం సమీపంలో ..

భామిని: భామిని మండలంలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న నాలుగు ఏనుగులు ఖాజీపురం సమీపంలోని జీడి తోటల్లో ఆదివారం సాయంత్రం హల్‌చల్ చేశాయి. దీంతో ఆదివాసీ గిరిజనులు తీవ్ర భయాందోళన చెందారు. గత పది రోజులుగా తివ్వకొండ పరిసర గ్రామాల్లోనే అవి సంచరిస్తుండడంతో బయటకు రాలేకపోతున్నామని , ఇప్పటికే వాటి వల్ల మొక్కజొన్న, వరి, అరటి పంటలను నష్టపోయామని వారు వాపోయారు. కాగా రైతులు, ప్రజలను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దాలినాయుడు అప్రమత్తం చేశారు. ఏనుగులు ఉన్న ప్రాంతానికి వెళ్లరాదని సూచించారు.



భామిని మండలంలో సంచరిస్తున్న గజరాజులు







నేడే తొలేళ్ల సంబరం



విజయనగరంరూరల్/కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల కొంగుబంగారం పైడిమాంబ అమ్మ వారి తొలేళ్ల సంబరం సోమవారం జరగనుంది. సిరిమానోత్సవానికి ముందు జరిగే ఈ తొలేళ్ల ఉత్సవం కోసం దేవదాయశాఖ, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకోనున్నారు. తొలేళ్ల ఉత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఉత్సవం జరిగే రోజు రాత్రి చదురుగుడి వద్ద ఉన్న అమ్మవారి ఆలయం నుంచి పూజారి బంటుపల్లి వెంకటరావు ఘటాలతో ఊరేగింపుగా కోటకు వెళ్తారు. కోట ముఖద్వారం వద్ద ఉన్న కోట శక్తి అమ్మవారిని పూజిస్తారు. అనంతరం చదురుగుడి వద్ద రైతులకు విత్తనాలు అందిస్తారు. ఈ విత్తనాలు జల్లితే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. సోమవారం రాత్రి అమ్మవారి వనంగుడి, చదురుగుడి ప్రాంతాల్లో పలు అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలేళ్ల, సిరిమాను సంబరం ముగిసే వరకూ

(మిగతా 6వ పేజీలో...)



సిద్ధమవుతున్న సిరిమాను రథాలు

నేడు గ్రీవెన్స్ రద్దు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం, విజయనగరం ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించినున్న పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

రేపు రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదానం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పైడితల్లి పండుగ సందర్భంగా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి స్థానిక రెవెన్యూ హోం, రైల్వే స్టేషన్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పైడిమాంబకు వెండి బిందెల బహూకరణ

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవం సందర్భంగా నగరానికి చెందిన టీడీపీ నాయకుడు అవనాపు విజయ్ ఆదివారం పైడిమాంబకు ఐదు కిలోల నాలుగు వెండి బిందెలను బహూకరించారు. ఆలయ ఈవో కార్యాలయంలో ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో ఆయన వీటిని అందజేశారు. విజయ్‌తో పాటు ఆయన సతీమణి భార్గవి, మాజీ కౌన్సిలరు, విజయ్ తల్లి అవనాపు చిన్నమ్మలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

చీపురుపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు మీసాల అప్పలనాయుడు, ఎ.సత్యశ్రీనివాస్, మామిడి శ్రీను తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం వారు చీపురుపల్లిలో ఫ్యాప్టో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.రాము, సూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖచిత్రంగా సతీ సహగమన శిల


సతీ సహగమన శిల

రాజాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వాసుదేవపట్నం శ్మశానవాటికలో గల సతీ సహగమన శిలను 'రాజాం చరిత్ర సంస్కృతి' అనే గ్రంథానికి ముఖచిత్రంగా అలంకరించే అవకాశం వచ్చిందని ఆ గ్రంథ రచయిత గార రంగనాథం ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ ప్రాంతాన్ని 700 సంవత్సరాల కిందట జయపురం రాజులు పరిపాలించారని, వారి పాలనలోనే ఇటాంటి సతీసహగమన దురాచారం ఉండేదని ఆయన వివరించారు.

రూ.50వేలు ఆర్థిక సాయం

భోగాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోగొట్టుకుని, పేదరికంతో ఇబ్బంది పడుతున్న రామచంద్రపేటకు చెందిన ఇప్పిలి రాంబాబుకు గ్రామానికి చెందిన జనసైనికులు నొడగల రాము ఆధ్వర్యంలో ఆదివారం రూ.50వేలు సాయం చేశారు. సీహెచ్‌సీ ఆరోగ్య సలహా కమిటీ మెంబరు బొల్లు త్రినాథ్, కోలా గోవింద పాల్గొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేయండి

జామి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జామి పీఏసీఎస్ నూతన కార్యవర్గం సొసైటీ బలపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం జామిలో నూతన సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న వర్మ, ఇద్దరు డైరెక్టర్లతో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు ఎస్.కోట పీఏసీఎస్ అధ్యక్షుడి ప్రమాణస్వీకారం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పీఏసీఎస్ అధ్యక్షుడిగా జీఎస్ నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం మండలంలోని పోతనాపల్లి గ్రామంలో గల ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరుగనుంది. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పార్టీ నాయకులు కోరారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ అధికార ప్రతినిధిగా దవళ

నెల్లిమర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మొయిద విజయరాంపురం గ్రామానికి చెందిన దవళ లక్ష్మణరావును వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా సురేష్

డెంకాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం డెంకాడ మండల అధ్యక్షుడిగా ముద్దాడ సురేష్‌యాదవ్‌ను నియమించారు. ఆదివారం విజయనగరం జిల్లా బీసీ సంక్షేమ సంఘం యాదవ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు గొలగాన రమేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం రమేష్ యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ కులస్థులు పాల్గొన్నారు.

ఉత్సవ సందడి

● ఘనంగా విజయనగరం ఉత్సవాలు ● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


వైద్యావిజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలను జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లయన్స్‌క్లబ్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. థింసా నృత్యం, కర్రసాము, పులివేషాలు, డప్పు వాయిద్యం, గిరిజన నృత్యం, జముకులు కథ, రేలారేలా ఫోక్ సాంగ్స్ కోలాటం, తప్పెటగుళ్లు, బుర్రకథ, తూర్పు భాగవతం, డాక్యుమెంటరీ షో వంటి సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలు పీవీ పద్మనాభం, టీపీ భవానీ, బి.ఆశయ్య, పీవీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోట ఆవరణలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా కోట ఆవరణలో ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తదితర ప్రముఖులతో కలిసి ఈ విద్య వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించారు. వాటికి సంబంధించి వివరాలను డీఈవో మాణిక్యంనాయుడు వివరించారు.

● ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోటలో వీర జవాన్ల చిత్రపటాలతో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సందర్శించి, నివాళులర్పించారు.

ఆకట్టుకున్న శ్రీనాథ విజయం

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలలో భాగంగా ఎంఆర్ లేడీస్ రీక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉన్న సాహిత్య వేదికపై ఆదివారం నిర్వహించిన సంగీత, సాహిత్య సమరాంగణ శ్రీనాథ విజయం నాటకం, శతాధిక కవి సమ్మేళనం ఆద్యాంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. శ్రీనాథ విజయం నాటకానికి జక్కు రామకృష్ణ, కట్టమూరి చంద్రశేఖర్‌లు అనుసంధాన కర్తలుగా వ్యవహరించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమానికి చీకటి దివాకర్, సముద్రాల గురుప్రసాద్, సూర్యలక్ష్మి, మానాప్రగడ సాహితి అధ్యక్షత వహించారు. అనంతరం పలువురు కవులను నిర్వాహకులు సత్కరించారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ జీఈ జనార్ధన నాయుడు పాల్గొన్నారు.


గంగిరెద్దుల సందడి

ఈపీడీసీఎల్ ఎస్ఈ సందడి

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవ ర్యాలీ అనంతరం స్థానిక కోట కూడలి వద్ద నిర్వహించిన వివిధ రకాల ప్రదర్శనలో ఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీరు మువ్వల లక్ష్మణరావు సందడి చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వేదికగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణరావు నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగులు కొంత మంది ఉత్సవంలో నృత్యాలు చేయగా, ఇంతలో ఎస్ఈ లక్ష్మణరావు వారితో కలిపి నృత్యం చేసి, అందరినీ ఆశ్చర్యపరిచారు.

కళాకారులకు సత్కారం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహారాజా సంగీత కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగా యి. ఈ ప్రదర్శనలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తిలకించారు. ఈసందర్భంగా కళాకారులను ఎంపీ, ఎమ్మెల్యే సత్కరించి.. అభినందించారు. కళాకారులు కూడా ప్రజాప్రతినిధులను సత్కరించారు.


కన్యాశుల్కం నాటకంలో ఓ సన్నివేశం

మహిళలతో కన్యాశుల్కం

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా కోట ఎదురుగా ఉన్న బొంకుల దిబ్బ వద్ద నిర్వహించిన కన్యాశుల్కం నాటకం ఆకట్టుకుంది. ఈ వేదిక ఇన్‌చార్జిగా గనుల శాఖ ఏడీ సీహెచ్ సూర్యచంద్రరావు వ్యవహరించారు. కేవలం మహిళలతో నిర్వహించిన ఈ నాటకం ఆహూతులను ఆకట్టుకుంది.


క్రీడలతోనే మానసిక ఉల్లాసం


క్రీడాకారుల ప్రదర్శన

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. ఉత్సవాల్లో భాగంగా విజ్జీ మైదానం లో ఆమె క్రీడలను ప్రారంభించారు. ముందు గా క్రీడాకారులను పరిచ యం చేసుకున్నారు. చెస్‌లో బాలుర విభాగంలో సత్యక్రిష్ గెలుపొంద గా.. బాలికల విభాగంలో సవిత గెలుపొందారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు


మహిళల కోలాటం


కోట గోడపై లేజర్ షో


కోలాటం ఆడుతున్న మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి

మోతీమహల్‌లో ఆడిటోరియం ప్రారంభం


మాట్లాడుతున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోటలోని మోతీమహల్ అభినవ ఆంధ్రభోజ మహారాజా ఆనందగజపతిరాజు ఆడిటోరియంను మాన్సాస్ విద్యా సంస్థల చైర్మన్, గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆడిటోరియం ఎంతో మంది విద్యార్థులకు వారి నైపుణ్యాలు, వ్యక్తిత్వం వికాసం పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డా.కేవీఎల్ రాజు, ఈవో ప్రసాద్, ఎంవీజీఆర్ ఇంజనీరింగు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామ రాజు, మాన్సాస్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ సాంబశివ రావు, పీఎస్ఎన్ రాజు, వైఎంసీ శేఖర్ పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనుల్లో జాప్యం వద్దు

రాజాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి రైల్వే వంతెన పనుల్లో జాప్యం చేయవద్దని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం రాజాంలోని తన క్యాంపు కార్యాలయంలో రైల్వే ఆర్అండ్‌బీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంతెన పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వంతెన తో పాటు సర్వీసు రోడ్డును కూడా సకాలంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బీ కార్యానిర్వాహక ఇంజనీరు ఎం.జేమ్స్, డీఈఈ రవి శేఖర్, ఏఈఈ మురళిబాబు, రైల్వే అధికారులు ఏఎక్స్ఎన్ డి.ప్రకాష్‌రావు, ఎస్ఎస్ఈ పీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపారావుకు ఘన సన్మానం


పాపారావును సన్మానిస్తున్న దృశ్యం

రాజాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావును ఆదివారం విజయవాడలో సీతారామ్ ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. 29 సంవత్సరాలుగా ప్రైవేటు పాఠశాలను నిర్వహించడమే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ సన్మానం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ కొమరగిరి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సింహాచలం, రాష్ట్ర సలహాదారు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

గజపతినగరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి తావు లేకుండా ప్రతిఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం పీడీ శారదదేవి అన్నారు. ఆదివారం మరుపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఏపీవో కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా దర్శనానికి అనుమతులు


వీఐపీ గేటు వద్ద జనం

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తొలేళ్ల ఉత్సవం ప్రారంభం కాకముందే పైడిమాంబ దర్శనానికి పైరవీల పెత్తనం ఎక్కువ అవుతున్నది. ఆలయ ప్రధాన ద్వారం వద్ద ప్రముఖుల దర్శనం కోసం వీఐపీ గేటు ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ గేటులో వీఐపీల సంగతి ఎలా ఉన్నా, అనధికారంగా చాలా మంది ఆ గేటు నుంచే వెళ్లారు. అమ్మవారి ఆలయం ఎడమవైపున క్యూ లైను ముందు కూడా ఒక గేటు ఏర్పాటు చేశారు. ఈ గేటులో కూడా చాలా మంది భక్తులను పంపించారు. అలాగే ఆలయం వెనుక భాగం నుంచి కూడా అమ్మవారి దర్శనానికి చాలా మందిని అనుమతించడంతో క్యూలైన్లో భక్తులు గంటల తరబడి ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

● దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈవో కె.శిరీషా ఆదివారం ఈవో కార్యాలయంలో నుంచి అమ్మవారి దర్శనాల క్యూలైన్లను సీసీ ఫుటేజీలో పర్యవేక్షించారు. అనధికారికంగా ఎవరినీ ఆలయం వెనుక గేటు నుంచి, వీఐపీ గేటు నుంచి అనుమతించవద్దని సిబ్బందిని ఆదేశించారు. వెనుక గేటు నుంచి పంపిన వ్యక్తులను పిలిచి మందలించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె ఆలయ అధికారులకు సూచించారు.

చర్చనీయాంశమైన డీసీసీబీ వేదిక

విజయనగరం/ విజయనగరం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమాను జాతర నేపథ్యంలో డీసీసీబీ వేదిక విషయం చర్చనీయాంశమైంది. ప్రతి ఏడాది డీసీసీబీ వేదిక నుంచి బొత్స కుటుంబీకులు సిరిమాను తిలకిస్తుండేవారు. ఎందుకంటే బొత్స సిఫారసు చేసిన వ్యక్తులే ఆ బ్యాంకుకు చైర్మన్‌గా వ్యవహరిస్తుండేవారు. అయితే ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్‌గా, జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున వ్యవహరిస్తుండడంతో సీన్ రివర్స్ అయ్యింది. ఈ ఏడాది డీసీసీబీ వేదిక వద్ద సిరిమాను తిలకించేందుకు పీఏసీఎస్ అధ్యక్షుల విన్నపం మేరకు ఏర్పాట్లు చేయాలని నాగార్జున నిర్ణయించారు. ఈ వేదికపై డీసీసీబీ చైర్మన్‌తో పాటు, డీసీఎంఎస్ చైర్మన్ గొంపా కృష్ణ, ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల పీఏసీఎస్ అధ్యక్షులు, సభ్యులు తిలకించనున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా.. డీసీసీబీ వేదిక వద్ద సిరిమాను తిలకించేందుకు ఏర్పాట్లు చేయాలని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అధికారులకు లేఖ రాశారు. ఈ లేఖపై డీసీసీబీ చైర్మన్ స్పందించడంతో ఇరు పార్టీల మధ్య డీసీసీబీ వేదిక అంశం రాజకీయ దుమారం లేపింది.

● అయితే అధికార యంత్రాంగం చర్చించి.. ఎమ్మెల్సీ బొత్స కుటుంబీకులు, వైసీపీ నాయకులకు డీసీసీబీ కార్యాలయం వద్దే వేదిక ఏర్పాటు చేయాలని చివరికి నిర్ణయించింది.

ఎమ్మెల్యేకు ఫేకర్ కార్మికుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కళాకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికులు

గరివిడి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు ఫేకర్ కార్మికులు ఆదివారం కలిసి తమ కృతజ్ఞతలను తెలిపారు. ఫేకర్ గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఫేకర్‌లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న 116 మంది కార్మికులు వారికి సరైన పేకేజీ ఇచ్చి సెటిల్‌మెంట్ చేయాలని యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ చర్చలు జరిపే విధంగా ఎమ్మెల్యే కళావెంకటరావు కృషి చేశారు. వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో కార్మికులు ఎమ్మెల్యేను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, ఎలకల వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల హర్షం



ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న దృశ్యం

భోగాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందజేయడంతో వారు హర్ష వ్యక్తం చేస్తూ ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే లోకం నాగమాధవి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. జనసేన క్లస్టర్ ఇన్‌చార్జి పల్లంట్ల జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల రాంబాబు, గుండపు సూర్యారావు, బొడ్డ హరిబాబు, పడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి పాలభిషేకం


ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న డోలపేట గ్రామస్థులు

రాజాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని దశాబ్దాలుగా పరిష్కారం కాని డోలపేట భూహక్కుల సమస్యపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించడంతో ఆయన చిత్రపటానికి ఆ గ్రామస్థులు పాలభిషేకం చేశారు. ఆదివారం డోలపేట గ్రామంలో సర్దార్ తాండ్ర పాపారాయ భూహక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘ నాయకులు గేదెల రవి, డోల చంద్రినాయుడు, రవీంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా అదే పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.వాసు, వి.అప్పలనాయుడు, కె.శ్రీను, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోపై చెట్టు కొమ్మ పడి ముగ్గురికి గాయాలు

కొత్తవలస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటోపై చెట్టు కొమ్మ విరిగి పడిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం తుమ్మికాపల్లిలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. విశాఖపట్టణం నుంచి ఎస్.కోట వైపు ఓ ఆటో ప్రయాణికులతో వెళ్తోంది. తుమ్మికాపల్లి అగ్నిమాపక కేంద్రం సమీపంలోకి వచ్చేసరికి, చెట్టు కొమ్మ విరిగి ఆటోపై పడింది. ఎస్.కోట మండలం వెంకటరమణపేటకు చెందిన డ్రైవర్ ఎర్రినాయుడుతో సహా ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్.కోటకు చెందిన కోలా సన్యాసయ్య, వెంకట లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది.

దుర్గమ్మ ఊరేగింపులో ఘర్షణ

● పోలీసులు చెదరగొట్టే క్రమంలో పలువురికి గాయాలు

గుర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన దేవీ ఊరేగింపు ఉత్సవంలో ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గీయులకు సంబంధించిన దేవీ బొమ్మలు ఒకేరోజు నిమజ్జనం చేసేందుకు ఊరేగింపు నిర్వహించారు. దీంతో ఒకే రూట్‌లో వెళ్లే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ కారణంగా సుమారు రాత్రి 10 గంటల వరకు ఎవరూ ముందుకు కదలలేదు. దీంతో చీపురుపల్లి సీఐ శంకరరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలకు నచ్చజెప్పారు. కానీ ఎవరూ ముందుకు కదలలేదు. పోలీసులు అసహనంతో జనాలను చెదరగొట్టారు. ఈక్రమంలో కొంతమందికి చిన్న చిన్న గాయాలయ్యాయి. సారంపాటి ఆనందరావుకు కొద్దిపాటి దెబ్బలు తగలడంతో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతనిని అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

భోగాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ కొల్లిపేటకు చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ పి.సూర్యకుమారి ఆదివారం తెలిపారు. బాలిక విశాఖ జిల్లా తగరపువలసలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఎప్పటిలాగే శనివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రపోయింది. అదేరోజు రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో తల్లి దండ్రులకు మెలుకువ రావడంతో కుమార్తె ఇంట్లో లేనట్లు గుర్తించారు. రాత్రి సమయంలో చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో బాలిక తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులతో సంయమనం పాటించండి


విజయనగరం క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి సిరిమాను జాతరకు విచ్చేసిన భక్తులతో పోలీసు అధికారులు, సిబ్బంది సంయమనం పాటించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. ప్రతిఒక్కరూ వారి, వారి విధులను బాధ్యతతో సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. పండుగను తిలకించేందుకు వివిధ రాష్ట్రాలు, జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అందరితో మర్యాదగా వ్యవహరించి వివాదాలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే, ఇన్‌చార్జి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం


సైక్లింగ్ చేస్తున్న కమాండెంట్ పద్మనాభరాజు

డెంకాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐదో బెటాలియన్‌లో 'ఫిట్ ఇండియా'లో భాగంగా కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో 'సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ మాట్లాడుతూ సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాపూజీ, డీవీ రమణమూర్తి, ఎం.గోపాలకృష్ణ, యూనిట్ ఆర్ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా పోరాటం ఎవరికీ పట్టడం లేదు


బొడ్డవరలో రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీ తమను మోసం చేసిందని బొడ్డవర గ్రామంలో గిరిజన, హరిజన, మైనార్టీలు శాంతియుతంగా పోరాటం చేస్తుంటే ఎవరికీ పట్టడం లేదని వారు మండిపడుతున్నారు. ఆదివారం బొడ్డవర గ్రామంలో 108వ రోజు రిలే నిరాహార దీక్షలో వారంతా పాల్గొన్నారు. ఎవరు ఎన్ని బెదిరింపులకు ప్రయత్నించినా న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఉన్నారు.

వానొస్తే వణుకే!

(3వ పేజీ తరువాయి)

తులసిరామినాయుడువలస సమీపంలో లేఅవుట్లు వేసి పట్టాలు మంజూరు చేశారు. కానీ ఇళ్లు మంజూరు చేయలేదు. వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బానంగి, కళ్లికోట ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. దీంతో ఆ ప్రాంతవాసులు రెండు, మూడు రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా ఆయా గ్రామాలను పరిశీలించిన ప్రభుత్వ విప్ జోయక జగ దీశ్వరి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, నిర్వాసితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలపడంతో నిర్వాసితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరితగతిన తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

నేడే తొలేళ్ల సంబరం

(3వ పేజీ తరువాయి)

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అమ్మవారి ఆలయానికి ఇరువైపులా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. 2,600 మంది పోలీసులతో బందో బస్తు నిర్వహించనున్నారు. 124 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందికి బాడీ కెమెరాలు అందించారు. మరికొంత మందిని మఫ్టీలో నియమించారు. సిరిమాను తిరిగే ప్రాంతంలో రోడ్డుకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పలు కూడళ్ల వద్ద మూడెంచెల భద్రత కోసం ఇనుప కంచెలు పెట్టారు.

సిద్ధమైన సిరిమాను రథాలు

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన మంగళవారం జరిగే సిరిమానోత్సవం కోసం రథాలు సిద్ధమయ్యాయి. సిరిమాను తిప్పే రథాలు, అంజలి, జాలరి రథాలకు సంబంధించిన చక్రాలను అధికారులు అమర్చారు. ఆలయ పూజారి బంటుపల్లి బైరాగినాయుడు నివాసం హుకుంపేటలో ఆదివారం సిరిమాను, రథాలకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటల్లోపే హుకుంపేటలో సిరిమానుకు పూజలు నిర్వహించి, అనంతరం అక్కడినుంచి చదురుగుడి వద్దకు తరలించనున్నారు.

50వేల లడ్డూలు.. ప్రసాదాలు సిద్ధం

తొలేళ్లు, సిరిమానోత్సవం కోసం వచ్చే భక్తుల కోసం అధికారులు ప్రసాదాలను సిద్ధం చేశారు. సోమ, మంగళవారం ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. 50వేలకు పైగా లడ్డూలు, 30వేలకు పైగా పులిహోర ప్యాకెట్లను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. 80 గ్రాముల లడ్డూ రూ.15, వంద గ్రాముల పులిహోర ప్యాకెట్ రూ.10కి విక్రయించనున్నారు.

విద్యార్థినుల మృతి బాధాకరం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కురపాం గిరిజన ఆశ్రమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని వైసీపీ జిల్లా విద్యార్థి అనుబంధ అధ్యక్షుడు, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకరరావు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఏజెన్సీలో పర్యాటక సందడి

సీతంపేట రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని ఆడలీ వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పార్క్‌లోని 5డి థియేటర్, షూటింగ్, స్కై సైక్లింగ్, బోటింగ్ క్రీడల్లో పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

కొమరాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం అంటివలసలో ఆయన పర్యటించారు. తక్షణమే వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా శ్రీచక్ర తీర్థస్నానం

గరుగుబిల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో నిర్వహిస్తున్న శ్రీబ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈనెల 2 నుంచి ఉభయ దేవస్థానాల పరిధిలో శ్రీబ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపును పురస్కరించుకుని స్వామివార్లకు దేవస్థాన ప్రాంగణంలో శ్రీచక్ర తీర్థస్నానాలను ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచార్యులు వైభవంగా చేపట్టారు. శ్రీచక్ర తీర్థ స్నానాలకు తరలివచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను ఈవో సూర్యనారాయణ సమకూర్చారు.



శ్రీచక్ర తీర్థస్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు

వరద ప్రవాహం తగ్గుముఖం

గరుగుబిల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో నదిలోకి భారీగా వరద చేరింది. ఆదివారం ఎగువ నుంచి 10 వేల క్యూసెక్కుల వరదనీరు చేరింది. దీంతో అధికారులు స్పిల్‌వే గేట్ల నుంచి 11 వేల క్యూసెక్కుల మేర నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే ప్రధాన కాలువల నుంచి 1020 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

సీతంపేట రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో ఇద్దరు గిరిజన విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీతంపేట మండలానికి చెందిన హెచ్.సంయుక్త అండర్ 19 విభాగం, హెచ్.లక్షిత అండర్ 17 విభాగంలో ప్రతిభ చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంపిక కమిటీ సభ్యులతో పాటు ఆర్చరీ కోచ్ మధు, విద్యార్థినుల తల్లిదండ్రులు అభినందించారు.

కురుపాం గురుకులం సందర్శన

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కురుపాం గురుకుల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు ఆదివారం సందర్శించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో అక్కడ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యాధికారితో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. విద్యార్థినులను వివిధ వైద్య పరీక్షల కోసం కేజీహెచ్‌కు తరలించిన నేపథ్యంలో అక్కడ సూపర్‌వైజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్నంత వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. జనసేననాయకులు నేరేడుబిల్లి వంశీ, అధికారి అనీల్, తాడేల శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించండి

వీరఘట్టం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. వీరఘట్టంలోని శాంతి ఆశ్రమంలో ఆదివారం దివ్యజీవన సత్సంగం నిర్వహించారు. కార్యక్రమంలో కర్రి గోపన్న, మోహన్‌దాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైసీపీ నాయకుల పరామర్శ

మహారాణిపేట (విశాఖపట్నం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో కలుషిత నీరు తాగడం వల్ల గిరిజన బాలికలు పచ్చకామెర్ల వ్యాధితో అస్వస్థతకు గురయ్యారని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ నాయకురాలు పుష్ప శ్రీవాణి ఆరోపించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకులం విద్యార్థినులను వైసీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. అరుకు ఎంపీ తనూజా రాణి మాట్లాడుతూ గిరిజన పిల్లలకు కనీస మౌలిక ఆరోగ్య సదుపాయాలు కల్పించకపోవటవే ఇందుకు కారణమని విమర్శించారు. ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర విద్యార్థినులను పరామర్శించారు.

నేటి నుంచి నందన్న ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న నందన్నలు

సాలూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గౌరీ పౌర్ణమి సందర్భంగా సోమవారం నుంచి నందన్న ఉత్సవాలను మండలంలో ప్రారంభం కానున్నాయి. ఏటా గౌరీ పౌర్ణమి నుంచి నందన్న ఉత్సవాలను సాలూరు అర్బన్, రూరల్‌లో పెద్దఎత్తున నిర్వహిస్తారు. ఇందుకోసం నందన్న విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. కూర్మరాజుపేట, దేవుబుచ్చింపేట, పెదబోరబంద, బంగారమ్మపేట తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

నందన్న విగ్రహాల తయారీ

●భామిని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగిడి గ్రామంలో నందన్న విగ్రహాలను కుమ్మరి కులస్థులు తయారు చేస్తున్నారు. సోమవారం గౌరీ పౌర్ణమి కావడంతో ఇంటిల్లపాది నందన్న, శివపార్వతుల విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలవండి

పార్వతీపురం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్‌ల ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నోబుల్ వాకర్స్ క్లబ్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐ.గున్నేష్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ 164 కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. వాకర్స్ క్లబ్‌లు సమసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

మహాసభలను జయప్రదం చేయండి

పాలకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 16న తలపెట్టిన రైతు సంఘం జిల్లా మూడో మహాసభలను అందరూ జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, నాయకులు ఖండాపు ప్రసాదరావు కోరారు. ఆదివారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. రైతుల సమస్యలపై ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు ఎం.విజయ, ఎం.అప్పన్న, పి.జ్యోతి, దామోదరరావు పాల్గొన్నారు.

రైతులకు తీరని నష్టం

వీరఘట్టం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంబర, కంబరవలస, దశమంతుపురం, నడిమికెల్ల, చిట్టిపుడి వలస గ్రామాల్లో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పంటలను పరిశీలించి, నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దాంతో ఆదివారం ఉద్యానవన శాఖ అధికారి జయశ్రీ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. నష్టాలను అంచనా వేశారు.

స్వయంభూ శివలింగం ప్రత్యక్షం



శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పనకాబడి పంచాయతీ కుశ గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో స్వయంభూ శివలింగం ఆదివారం ప్రత్యక్షమైంది. శివలింగాన్ని గుర్తించిన గ్రామస్థులు ఆ పరిసరాలను శుభ్రం చేసి పూజలు చేశారు. తహసీల్దార్ శేఖరం, గిరిజన నాయకులు సింహాచలం, గిరిజన సాంస్కృతిక ప్రచారకర్త, ఉపాధ్యాయుడు నాగభూషణం తదితరులు శివలింగాన్ని సందర్శించారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై గుంతలను పూడుస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): అంటికొండ, పెద్దగూడ, కురసింగి గ్రామస్థులు శని, ఆదివారాల్లో శ్రమదానం చేసి రోడ్డును బాగుచేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీలోని అంటికొండ, పెద్దగూడ, కురసింగి గ్రామాలకు వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు సైతం నిలిచిపోయాయి. దీంతో మూడు గ్రామాలకు చెందిన గిరిజనులు స్పందించారు. అందరూ సమష్టిగా శని, ఆదివారాల్లో శ్రమదానం చేసి సామరెల్లి నుంచి పెద్దగూడ వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డును బాగుచేసుకున్నారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి అంటికొండ రహదారిలో ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. శ్రమదానం చేసిన వారిలో పెద్దగూడ సర్పంచ్ బాపయ్య, మాజీ సర్పంచ్ ఫకీరు, పాల్గుణ, గంగయ్య, సుందరరావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కళా పరామర్శ

వీరఘట్టం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వండువ గ్రామానికి చెందిన డాక్టర్ గొర్లె నాగభూషణరావు తల్లి, మాజీ సర్పంచ్ వరహాలమ్మ, బొడ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పొన్నాడ నాగేశ్వరరావు తల్లి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబాలను ఆదివారం చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కురుపాం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ఆమె కేజీహెచ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పాఠశాలలో 129 మంది పచ్చకామెర్లతో అస్వస్థతకు గురయ్యారన్నారు. 37 మందిని కేజీహెచ్‌లో చేర్పించామన్నారు. హాస్టల్ వద్ద మెడికల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మిగిలిన చిన్నారులకు పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలో పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉన్నాయని, కొత్తగా 40 టాయిలెట్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వాతావరణం మారడం వల్ల ఎక్కువగా జ్వరాలు వస్తు న్నాయని, పిల్లలు పండగలకు వెళ్లి వచ్చిన తరువాత కొంతమేర అస్వస్థతకు గురవుతుంటారన్నారు. బాలికలు అస్వస్థతకు గురవ్వడంపై విచారణ చేస్తున్నామని, ఎవరి తప్పిదమైనా ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.